## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కక్కర్‌వాడ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన రామలింగేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఆలయంలో ఈశ్వరుడు, నంది యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

### అకాల వర్షాలతో తీరని నష్టం



రంజోల్ గ్రామంలో రాలిన మామిడి కాయలు

జహీరాబాద్ టౌన్: ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు మామిడి రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చింది. రెండు రోజులుగా జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిశాయి. బలమైన గాలుల వల్ల ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. ఈసారి కాత తక్కువగా ఉందని, గాలి, వాన వల్ల ఉన్న కాయలు కూడా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉద్యాన పంటలైన బొప్పాయి, పుచ్చకాయ, టమాటా, ఉల్లిగడ్డ, ఆకు కూరలు కూడా దెబ్బతిన్నాయి. గాలివానకు పెద్ద చెట్లు రోడ్లపై కూలిపోవడంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.

### గరుడ ప్రసాదంతో సంతాన సాఫల్యం

**దంపతుల్లో పెరుగుతున్న నమ్మకం**



పూజ నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

జోగిపేట(అందోల్): అందోలులోని శ్రీ రంగనాథ దేవాలయంలో ప్రతీ ఏడాది నిర్వహించే గరుడ ప్రసాదంతో సంతానం కలుగుతుందన్న నమ్మకం బాగా పెరుగుతుంది. ఆరేళ్లుగా ఆలయంలో గరుడ ప్రసాదం కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి 120 మంది వరకు దంపతులు హాజరయ్యారు. గరత్మంతుడికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వేద బ్రాహ్మణులు దంపతులకు బెల్లంతో తయారు చేసిన పాయసాన్ని అందజేశారు.

### వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### ఎమ్మెల్యేను కలిసిన జిన్నారం గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రంలోని శివాలయం గుట్టపై శివుడి విగ్రహం ధ్వంసమైన ఘటనలో 30 మందిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం జిన్నారం గ్రామస్తులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని జిన్నారం మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేసు విషయంలో అన్ని విధాలుగా సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, మహేందర్ గౌడ్, సందీప్ రెడ్డి, బాలు పాల్గొన్నారు.

### వ్యక్తిపై కేసు నమోదు

పటాన్‌చెరు: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 993 ప్రభుత్వ స్థలంలో నరసింహరాజు అనే వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్ వెంకటస్వామి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యాన సాగు.. ప్రణాళిక ఖరారు



మల్చింగ్ విధానంలో సాగు చేసిన టమాట పంట

**సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా రూ.9 కోట్లు మంజూరు**

- సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలు, తీగ జాతి పంటలకు శాశ్వత పందిర్ల ఏర్పాటు
- జిల్లాకు ఒక్కో విత్తన శుద్ధి యూనిట్, శీతలగిడ్డంగి కేటాయింపు

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలో 2025–26 ఆర్థిక ఏడాదికి ఉద్యాన శాఖ ప్రణాళికను ఖరారు చేసింది. సమీకృత అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ అండ్ జాతీయ వెదురు మిషన్ ద్వారా చేపట్టాల్సిన లక్ష్యాలను ఉద్యాన శాఖ ఖరారు చేసింది. సమీకృత ఉద్యాన మిషన్ కింద రూ.9కోట్లతో డ్రిప్ పరికరాల పంపిణీ, పండ్ల తోటలు, కూరగాయలు, పూలతోటల పెంపకం, మల్చింగ్, పాత తోటల పునరుద్ధరణ, కొత్త తోటల పెంపకం, నీటి కుంటల ఏర్పాటు, వర్మీ కంపోస్టు యూనిట్లు తదితర వంటివి అమలు చేయనున్నారు.

**శాశ్వత పందిళ్ల ఏర్పాటు**

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద బిందు, తుంపర్ల సేద్యం, కూరగాయల సాగుకు శాశ్వత పందిరి నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు. జిల్లాకు ఒక విత్తన శుద్ధి యూనిట్‌ను ఇచ్చారు. ముందుకు వచ్చే రైతుకు దీన్ని కేటాయించనున్నారు. ఉద్యాన శాఖ ద్వారా రూ.కోటి ఆర్థిక సహాయం అందించనున్నారు. ఈ యూనిట్ కోసం రూ.11 కోట్ల నుంచి రూ.15 కోట్ల మేర పెట్టుబడి ఖర్చు వచ్చే అవకాశం ఉందని అంచనా. ఒక యూనిట్ జిల్లాకు కేటాయించారు. శీతలగిడ్డంగి ఏర్పాటుకు రూ.1.50 కోట్లు ఉద్యాన శాఖ సబ్సిడీ ఇవ్వనుంది. ఇది కూడా ఒక యూనిట్ మాత్రమే జిల్లాకు మంజూరయింది.

**గతేడాది 1,250 మంది రైతులకు...**

గతేడాది డ్రిప్ పరికరాలను రాయితీపై 1,250 మంది రైతులకు 1,600 హెక్టార్ల మేర అందజేశారు. ఇంకా పాత రైతులు 1,600 మంది డ్రిప్ కోసం మిగిలిపోయారు. వారికి ఈ విడతలో అందించాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. పంటల సాగులో ఉన్నందున గతేడాది రైతులకు డ్రిప్ పరికరాలను అందజేయలేకపోయారు. ఈ ఏడాది కూడా 1,600 హెక్టార్లకు డ్రిప్ పరికరాలను రాయితీపై అందించేందుకు ఉద్యాన శాఖ ప్రతిపాదించింది. అవసరం ఉన్న రైతులకు కూరగాయల నారును అందించనున్నారు. ఈ ఏడాది జిల్లాలో 5వేల ఎకరాల్లో కూరగాయలు సాగయ్యే అవకాశమున్నట్లు ఉద్యాన శాఖ అంచనా వేసింది. జిల్లాలో 3,750 ఎకరాల మేర ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. పండ్ల తోటల చుట్టూ, ఆయిల్‌పామ్ చుట్టూ వెదురు సాగు చేసుకునేందుకు ఉద్యాన శాఖ రైతులను ప్రోత్సహిస్తోంది. రూ.20కు ఒక మొక్క వంతున అందించనున్నారు.



సాగులో ఉన్న వంకాయ పంట

దీనికి సైతం రూ.10 కోట్లకు పైగా రైతులు పెట్టుబడి పెట్టుకోవాల్సి ఉంటుంది.

**తీగజాతి కూరగాయల సాగు పెంచేందుకు సబ్సిడీ...**

తీగజాతి కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సిమెంటు కడీలను పాతుకునేందుకు, ఇనుపతీగతో పందిరి వేసుకునేందుకు వీలుగా ఎకరాకు రూ.ఒక లక్ష రాయితీతో రైతులకు అందించనున్నారు.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**



ఉద్యాన శాఖ ద్వారా అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందిస్తాం. నీటి కుంటలను సైతం ఇచ్చేందుకు ప్రతిపాదించాం. విత్తన శుద్ధి యూనిట్, శీతల గిడ్డంగి ఒక్కొక్క యూనిట్ మంజూరయింది. ప్రభుత్వం అందించే సబ్సిడీని ఉపయోగించుకుని రైతులు లబ్ధిపొందాలి.

– సోమేశ్వరరావు
జిల్లా ఉద్యాన శాఖ అధికారి-సంగారెడ్డి

# పెండింగ్ పనులు పూర్తి చేయండి

**అభివృద్ధి పనులపై మంత్రి దామోదర సమీక్ష**

జోగిపేట(అందోల్): అందోల్– జోగిపేట మున్సిపల్ పరిధిలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. అందోల్– జోగిపేట మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులపై బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, రోడ్లు, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానికంగా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేని ఆర్డీవో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఐసీడీఎస్ కార్యాలయాలకు అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఆర్డీవో పాండుకు ఆదేశించారు. సంగుపేట నుంచి నేరడుగుంట చౌరస్తా వరకు కొనసాగుతున్న రెండు లేన్ల రోడ్డు పనులను త్వరిగతిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. విద్యార్థుల కోసం అందోల్ వద్ద నిర్మిస్తున్న బస్‌స్టాప్‌లను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. స్థానిక వివేకానంద విగ్రహం వద్ద పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి తెలిపారు. పార్కు ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అందోలు పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న మినీ ట్యాంక్ బండ్ పనులను ఆయన సమీక్షించారు. ఇంకా ఏమేమి పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మినీ ట్యాంక్ బండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. చెరువు వద్ద హరిత గెస్ట్‌హౌస్ ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఉమాశంకర్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ మల్లయ్య, మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల ప్రవీణ్ తదితరులున్నారు.

# గేటు పెట్టారు... ప్రహరీ మరిచారు



పాఠశాల ఆవరణలో ఇరువైపులా ప్రహరీ నిర్మించకుండానే ఏర్పాటు చేసిన గేటు

- దౌల్తాబాద్ జెడ్పీ హైస్కూల్‌కు రక్షణ కరువు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పాఠశాల
- కిటికీలు ధ్వంసం చేసిన ఆకతాయిలు

హత్నూర (సంగారెడ్డి): కొన్ని నెలల క్రితం హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొనేందుకు వస్తూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అయితే పాఠశాలకు గేటు లేకపోవడం గమనించిన కలెక్టర్ వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వెంటనే స్పందించి హడావిడిగా పాఠశాలకు గేటు అమర్చారు గానీ ఇరువైపులా ప్రహరీ నిర్మించడం మాత్రం మరిచిపోయారు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉండటంతో పాఠశాల ఆవరణలో మందుబాబులకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయింది. ఆకతాయిలు పాఠశాల కిటికీల అద్దాలను సైతం ధ్వంసం చేస్తున్నారు. పాఠశాలల్లోని తరగతి గదుల తాళాలు పగలగొట్టి మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి ఇలాగే ఉంటే పాఠశాల పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులే అర్థం చేసుకోవాలని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గేటుకు ఇరువైపులా ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

# ‘మైలాన్’పై కఠిన చర్యలు తీసుకోవద్దు

**కాలుష్య నియంత్రణ మండలికి హైకోర్టు ఆదేశం**

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా బొల్లారంలోని మైలాన్ లాబొరేటరీస్ లిమిటెడ్‌పై తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)ని హైకోర్టు ఆదేశించింది. అగ్ని ప్రమాదంపై నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణ ఈ నెల 21కి వాయిదా వేసింది. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో ఆర్‌అండ్‌డీతో పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని పీసీబీ ఈ నెల 8న జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మైలాన్ లాబొరేటరీస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ‘లాబొరేటరీస్‌లోని ఒక ఫ్లోర్‌లో మాత్రమే స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీల రక్షణ విభాగం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పనులు ఆపాలని సూచించింది. దీనికి విరుద్ధంగా పీసీబీ ఉత్తర్వులు జారీ చేసింది. పనులు నిలిపివేసేఅధికారం పీసీబీకి లేదు. ఆ ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలి’అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. నోటీసులైనా జారీ చేయకుండా చర్యలు తీసుకోవడాన్ని తప్పుబట్టింది. తదుపరి ఆదేశాల వరకు విద్యుత్ సరఫరా సహా ఇతర పనులపై కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

## వికసించిన మే పుష్పం

**ఏడాదిలో ఒకసారి మాత్రమే పూసే మే పుష్పాలు కంది ఓడీఎఫ్‌లో వికసించాయి. ఐఐటీ హైదరాబాద్ మాజీ ఉద్యోగి అయిన సత్యనారాయణ తన ఇంటి పెరట్లో మొక్కలు పెంచుతున్నారు. బుధవారం ఒక్కసారిగా ఈ మొక్కల పూలన్నీ విరగబూసి కనువిందు చేశాయి. ఎర్రగా ముద్దబంతి పువ్వులా కన్పించే ఈ పుష్పాలను చుట్టుపక్కలవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.**

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి





ఎర్ర బంతిలా అందంగా వికసించిన మే పుష్పాలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## ఆలయాల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం భారతినగర్ డివిజన్‌లోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన రాజగోపురం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే కన్యకా పరమేశ్వరి అలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు.

## పిడుగుపాటుకు గేదె మృతి



గేదె వద్ద రోదిస్తున్న బాధితురాలు

వట్‌పల్లి(అందోల్): పిడుగుపాటుకు గేదె మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని కన్‌సానిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చీలపల్లి బాలమణి గ్రామంలో గేదె మేపుతూ జీవనం సాగిస్తుంది. మంగళవారం అర్ధరాత్రి ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. ఇంటి బయట ఉన్న గేదెపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో రూ.90 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు పేర్కొంది.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ సత్యంగౌడ్ కాలనీ వాసులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని 9వ వార్డు ప్రియదర్శిని కాలనీలో బుధవారం 2023–24 ఆర్థిక ఏడాదికి సంబధించిన జనరల్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను మాజీ కౌన్సిలర్ సత్యంగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బేగరి ప్రశాంత్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టెల దుకాణంలో మంటలు



తగలబడుతున్న కట్టెల దుకాణం

పటాన్‌చెరుటౌన్: కట్టెల దుకాణంలో మంటలు అంటుకున్న ఘటన నందిగామలో చోటు చేసుకుంది. మండలంలోని నందిగామకు చెందిన నాగరాజు రహదారి పక్కన కట్టెల దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లిన సమయంలో కట్టెలకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చారు. అప్పటికే చాలా కట్టెలు కాలిపోయాయి. అయితే ప్రమాదం ఎలా జరిగింది అనే విషయంపై అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

# పశువుల అక్రమ రవాణా చేస్తే చర్యలు




చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: పశువుల అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కోటేశ్వర్‌రావు అన్నారు. రానున్న బక్రీద్‌ను పురస్కరించుకొని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ముత్తంగి జాతీయ రహదారిపై బుధవారం పటాన్‌చెరు పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. అనుమానాస్పదంగా పశువులను తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఒకవేళ పశువులను తరలిస్తే ఖచ్చితంగా వెటర్నరీ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ శైలజ ఈశ్వరకు ఆంగ్లంలో పీహెచ్‌డీ**

పటాన్‌చెరు: మండలంలోని రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) ఆంగ్లం, ఇతర భాషల విభాగం పరిశోధక విద్యార్థిని శైలజ ఈశ్వర డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ‘అనితారావు బాదామి, ఉమా పరమేశ్వరన్ ఎంపిక చేసిన నవలల్లో డయాస్పోరిక్ థీమ్‌ల అధ్యయనం’ అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న జీఎస్‌హెచ్ఎస్ ఆంగ్లం, ఇతర భాషల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జోసెఫ్ జయకర్ బుధవారం చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

**◆ నేడు దత్తాత్రేయ మందిర వార్షికోత్సవం**

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలోని రంజోల్‌లోని శ్రీదత్తాత్రేయ మందిరం ద్వితీయ వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, 9 గంటలకు దత్త హోమం, 11.30 గంటలకు పూర్ణహుతి, మధ్యాహ్నం 12 గంటలకు మార్కండేశ్వర పల్లకి సేవా ఊరేగింపు, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

**◆ ఆలయంలో సప్తాహం**

నారాయణఖేడ్: మండలంలోని బాణాపూర్ శ్రీరుక్మిణి పాండురంగ ఆలయంలో 22వ అఖండ హరినామ సప్తాహం నాలుగవరోజు బుధవారం కూడా కొనసాగింది. సప్తాహంలో భాగంగా ప్రవచనం, హరిపాఠ్, కీర్తన, మరాఠీ, తెలుగులో భజనలు, కాకడహారతి, గాథపూజ, తీర్థ, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

**◆ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 11, 12 బ్లాక్‌లలో బుధవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ త్వరలో డ్రైనేజీ సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

**◆ సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని నందికంది శివారులోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ వద్ద సమ్మె వాల్‌పోస్టర్‌ను బుధవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో పరిశ్రమ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, యూనియన్ నాయకులు వీరేశం,చంద్రశేఖర్,జనార్ధన్, సాయిలు,మొగులయ్య, జోసఫ్,నాగ మల్లేశ్,పాండు తదితరులు పాల్గొన్నారు.

**◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు బుధవారం బీఆర్ఎస్ నాయకులు రూ.2,56,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పస్తాపూర్, రంజోల్, రాచన్నపేట, హమాలీకాలనీ, బసవేశ్వర వీధి, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఆర్యనగర్, చిన్న హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు క్యాంప్ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకూబ్, అశోక్ శేరి, వెంకటేశం గుప్త, పద్మజ, అశోక్‌రెడ్డి, పాండు, నరేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

**◆ విగ్రహారాధనతో మనసుకు ప్రశాంతత**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగులో సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

**◆ మందుబాబులకు జరిమానా**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 11 మందికి రూ. 1,500, మరో ఇద్దరికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు చెప్పారు.

**◆ గుమ్మడిదల మండలంలో భారీ వర్షం**

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరింది. గంటపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది.

**◆ బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత**

శివ్వంపేట(నర్సాపూర్): బాల్య వివాహాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాలల సంరక్షణ విభాగం అధికారులు సరిత, శంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, అక్రమ దత్తత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, యువతుల పై జరిగే దాడులపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన అనంతరం ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని మైనర్ పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే చట్టరీత్యా వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఆడపిల్లలపై దాడులు, బలవంతపు పెళ్లిళ్లు, ఇతర సమస్యలపై హెల్ప్‌లైన్ నంబరు 1098 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయ తదితరులు ఉన్నారు.

**◆ రసాయనాల వాడకాన్ని తగ్గించాలి**

**రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన**



నర్సాపూర్ రూరల్: మండలంలోని కాగజ్‌మద్దూరు, జక్కపల్లి గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. రసాయన వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. భూములకు అనుగుణంగా నేల పరీక్షలు చేయించుకుని విత్తనాలు చేసుకోవాలని చెప్పారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పద్మశ్రీ, గీత, సవిత, గాయత్రి, ఏఓ దీపిక, ఏఈఓ చంద్ర వేణి, రైతులు పాల్గొన్నారు.